క్లుప్తంగా

'ప్రియదర్శిని' ఆధ్వర్యాన అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ నవీన్‌బాబు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రియదర్శిని విద్యాసంస్థల ఆధ్వర్యాన ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు అంబిషన్స్ సంస్థచే కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అంశంపై అవగాహన సదస్సును నిర్వహించినట్లు విద్యాసంస్థల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు. శుక్రవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంబిషన్స్ కెరీర్ కౌన్సిలింగ్ సీఈఓ డాక్టర్ శరత్ గరిమెల, సంజయ్ ఫెడరిక్, అంబిషన్స్ వ్యవస్థాపకుడు సాయిరాం నాగారం తదితరులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, ఎం.వెంకటేశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడికి నివాళి

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు చావా అప్పారావు(78) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, బండి రమేష్, కె.వీ.రెడ్డి, ఏటుకూరి రామారావు, ఇంటూరి అశోక్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, చావా కిరణ్, సీపీఐ రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడుకి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా వెంకన్న

కూసుమంచి: నేలకొండపల్లి–కూసుమంచి రూట్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మండలంలోని మల్లేపల్లికి చెందిన పులిపాటి వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన సమావేశంలో నేలకొండపల్లి–కూసుమంచి రూట్‌లో 120 మంది ఆటోలు నడుపుతుండగా.. నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతుః.. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

నగరంలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈమేరకు పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి.. పట్టువస్త్రాలను కానుకగా అందించారు. అలాగే పలు ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆయన వెంట మద్దినేని బేబి స్వర్ణకుమారి, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్ జగన్, మైనార్టీ నాయకులు ఇమామ్, మియా, చావా శివరామకృష్ణ, తోట ప్రసాద్, మొగిలిచర్ల సైదులు, గౌస్బేగ్ ఉన్నారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



శ్రీ కోదండరామచంద్రస్వామి ఆలయం

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామచంద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా శనివారం నుంచి హోమ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది యాగశాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మార్చి 1న ధ్వజ స్తంభం, మూలమూర్తుల ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు బుర్ర సుందర కుమారచార్యులు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	వినరో భాగ్యం విష్ణు కథ
సాయిరాం	కోనసీమ తగ్స్
ఆదిత్య	సెల్ఫీ
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	మిరపకాయ్

- ఖమ్మంవ్యవసాయం

విస్తరిస్తున్న వెంచర్లు..!

ప్లాట్లుగా మారుతున్న వ్యవసాయ భూములు

- రూ.కోట్లల్లో 'రియల్' వ్యాపారం
- ప్రాంతాలను బట్టి భూమికి ధరలు
- పలుచోట్ల నిబంధనలకు తిలోదకాలు



ఓ వెంచర్‌కు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



కూసుమంచి సమీపంలో ప్లాట్లుగా మారుతున్న వ్యవసాయ భూమి

కూసుమంచి: మండలంలో నానాటికి వెంచర్లు విస్తరిస్తున్నాయి. దీంతో ఎకరాల కొద్ది వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారుతున్నాయి. మండల కేంద్రంతో పాటు చేగొమ్మ క్రాస్‌రోడ్డు, నాయకన్‌గూడెం, జీళ్లచెరువు, గోపాలరావుపేట, గట్టుసింగారం, జుజుల్‌రావుపేట, నాయకన్‌గూడెం తదితర గ్రామాల్లో వెంచర్లు తయారవ్వగా.. ఇంకొన్ని తయారయ్యేందుకు సిద్ధమవుతున్నాయి. కొన్ని వెంచర్లలో ప్లాట్లను విక్రయిస్తుండగా.. మరి కొన్ని వెంచర్లలో శ్రీగంధం, మల్బరీ వేప లాంటివి పెంచి విక్రయిస్తున్నారు. దీంతో వెంచర్ల నిర్వాహకులు కోట్లాది రూపాయలు అర్జిస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి అందుబాటులోకి రావటంతో రహదారికి ఇరువైపులా వెంచర్లు వెలుస్తున్నాయి.

వ్యవసాయ భూములకు గిరాకీ..

వెంచర్లను వేసేందుకు అనువుగా ఉన్న వ్యవసాయ భూములను రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో అట్టి భూముల ధరలకు రెక్కలు వచ్చి ప్రాంతాన్ని బట్టి ఎకరం రూ. 50 లక్షల నుంచి రూ. 2కోట్ల వరకు పలుకుతుండటం గమనార్హం. ఖమ్మం– సూర్యాపేట జాతీయ రహదారి, కూసుమంచి–నేలకొండపల్లి, కూసుమంచి–ఖమ్మం రహదారిలో రోడ్డు వెంబడి ఉన్న భూములకు మంచి గిరాకీ ఏర్పడింది.

ప్లాట్ల ధరలకు రెక్కలు...

వెంచర్లలో అమ్మే ప్లాట్ల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఒక్కో వెంచర్‌లో గజం భూమి రూ. 5వేల నుంచి 15 వేల వరకు పలుకుతున్నాయి. కూసుమంచి మండల కేంద్రంలోని వెంచర్‌లో గజం రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతుండటం విశేషం.

నిబంధనలకు తూట్లు..

మండలంలో ఏర్పాటు చేస్తున్న కొన్ని వెంచర్లకు తగిన అనుమతులు లేవనే తెలుస్తోంది. కొందరు దరఖాస్తు చేసుకుని అనుమతులు రాకుండానే పనులు ప్రారంభించి ప్లాట్ల విక్రయాలు చేపడుతున్నారు. కాగా, కొనుగోలుదారులు కూడా ఎటువంటి అనుమతులు పరిశీలించకుండానే ప్లాట్లు కొనుగోలు చేస్తూ మోసపోతున్నారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు..



మండలంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్లకు అనుమతులు లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ల్యాండ్ కన్వర్షన్ చేసుకున్నాక అన్ని అనుమతులు వచ్చాకే వెంచర్లలో ప్లాట్లను విక్రయించాలి. గ్రామపంచాయతీకి గ్రీన్‌ఫీల్డ్ స్థలాన్ని అప్పగించాలి. వెంచర్లలో ప్లాట్లు కొనే వారికి తగిన సౌకర్యాలు కల్పించాలి. ఎటువంటి నిబంధనలు పాటించక పోయినా చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేని పలు వెంచర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచాం. కొనుగోలుదారులు అనుమతులు చూసుకోవాలి.

– డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, కూసుమంచి

గురుకుల సమస్యలపై స్పందించాలి



సమస్యలపై ఆరా తీస్తున్న బృందం ప్రతినిధులు

నేలకొండపల్లి: గురుకుల పాఠశాల సమస్యలపై అధికార యంత్రాంగం వెంటనే స్పందించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావు డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శుక్రవారం మహాజన సోషలిస్ట్ పార్టీ, సంఘం ప్రతినిధి బృందం గురుకులాన్ని సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం వంటగది, డ్రైయినేజీ, ఆర్‌ఓ ప్లాంట్ తదితర పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం ప్రతినిధి ఆనందరావు మాట్లాడుతూ.. విద్యార్థులు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష ఆందోళన చేయటంతో పాటు, అధికార యంత్రాంగాన్ని కలిసి వివరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పొట్టపింజర బాలస్వామి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, తోళ్ల సురేష్, కుక్కల రవీంద్రబాబు, మాదాసు వెంకన్న, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు బొల్లికొండ ప్రభాకర్, ఉపేందర్, వంగూరి బాలాజీ, వంగూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్తులను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసి ప్రైవేటీకరణ చేస్తుందని, దీనిపై క్షేత్రస్థాయిలో ఉద్యమించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో కే.వీ.రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీరం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. రైతుల పంట ఉత్పత్తుల ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆస్తులు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పొన్నం వెంకటేశ్వరరావు, గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, సిరికొండ ఉమామహేశ్వరీ, పగిడికత్తుల నాగేశ్వరరావు, ఇంటూరి అశోక్, మారుతి కొండలరావు, మందడపు మురళీ, బండి రామమూర్తి, దండా సూర్యనారాయణ, సిరికొండ నాగేశ్వరరావు, సామాల మల్లిఖార్జున్‌రావు, శివరాజు, గాదె వెంకటేశ్వరరావు, చింతలపాటి భాస్కర్, ఎరదేశి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలాయపాలెం: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సుబ్లేడు, బచ్చోడు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఈటీ భాషా పండిట్ల అప్‌గ్రేడ్ చేపట్టాలని, హెచ్ఎం పోస్టులు మంజూరు చేసి వాటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సతీష్ నాయకులు రవిబాబు, వేణు, అనిత, రాణి, రాఘవ, రమా తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను నిలిపివేయాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నాయకులు

ఖమ్మంగాంధీచౌక్: పోస్టల్ శాఖలో ఒక లక్ష్యం పూర్తి కాగానే వారం రోజులు గడవక ముందే మరో స్కీమ్ పేరుతో వేధించడం సరికాదని, వయసు మళ్లిన ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోందని పోస్టల్ శాఖ ఉమ్మడి జిల్లా నాయకుడు బి.రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం గాంధీచౌక్‌లోని జిల్లా ప్రాంతీయ కార్యాలయం వద్ద పోస్టుమెన్, గ్రామీణ తపాలా ఉద్యోగులు, క్లాస్ 3 ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌పీఈ రాష్ట్ర అధ్యక్షుడు లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలు గ్రామీణ తపాలా ఉద్యోగులను బానిసలుగా మారుస్తున్నాయన్నారు. జీతభత్యాల సవరింపు అంశాలను అమలు చేయకుండా.. పదోన్నతులు కల్పించాలని కోరితే దానిని కనీసం పరిశీలించకపోవడం అన్యాయమన్నారు. అనంతరం జిల్లా తపాలా అధికారికి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.కనకయ్య, హబీబ్, సురేష్, ప్రసాద్, రామారావు, శివ తదితరులున్నారు.

సన్మానం..



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కూరాకుల నాగభూషణం దంపతులు

ఖమ్మం మామిళ్లగూడెం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నారాయణవరపు శ్రీనివాస్‌కు డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, యాదమ్మ దంపతులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. శ్రీనగర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో ఆయనతో పాటు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిపల్లి కృష్ణమచారిని కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కూరాకుల వలరాజు, దేవస్థానం చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వెంకన్న, గంగరాజు, గుమ్మ రోసియా, రోషియాతో పాటు బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న మిత్రులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయమందించి తమ ఔదర్యాన్ని చాటుకున్నారు. నేలకొండపల్లికి చెందిన పదో తరగతి (1999–20)బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి కైరున్నిసా బేగం ఇటీవల మృతి చెందింది. కాగా, పూర్వ విద్యార్థులు సేకరించిన రూ.10 వేలను శుక్రవారం ఆమె కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆసీఫ్, ఏటుకూరి అనిల్, నాగుల్‌మీరా, పి.శ్రీనివారెడ్డి, వీరకోటి పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని శిక్షించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతిని ర్యాంగిగ్ చేసి ఆత్మహత్యకు పాల్పడేలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజన మోర్చా ఆధ్వర్యంలో జెడ్పీ సెంటర్‌లో దిష్టి బొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణగుప్త, మంద సరస్వతి, కల్యాణి, దొడ్డ అరుణ, అనిత, పద్మ, సుదర్శన్, చింతపల్లి వీరస్వామి, రాథోడ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ ప్లీనరీలో నాయకులు

తిరుమలాయపాలెం: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో శుక్రవారం నుంచి ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీకి మండల జెడ్పీటీసీ, టీపీసీసీ సభ్యుడు బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఈ ప్లీనరీలో నిర్ణయాలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

జామా మసీద్‌కు మంత్రి రూ.2లక్షల విరాళం

అభివృద్ధి పనులకు అందించిన పువ్వాడ



మత పెద్దలకు నగదు అందిస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మంలోని జామా మసీదును రాష్ట్ర రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మంత్రికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీంతో తక్షణమే స్పందించిన మంత్రి మసీదులో అబివృద్ధి పనుల కోసం పువ్వాడ ఫౌండేషన్ ద్వారా రూ.2 లక్షలను తన క్యాంపు కార్యాలయంలో మత పెద్దలకు అందజేశారు. అలాగే మసీద్ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ఇమామ్ సాబ్ అజీజ్, అబ్దుల్ ముబీన్, మహమూద్ ఆశ్రిఫ్, తాజుద్దీన్, ముక్తర్, ఇస్హాక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ..

ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా నియమితులైన వై.వెంకటేశ్వరరావు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.

వెయిట్ లిఫ్టింగ్ పరికరాల ప్రారంభం..

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు నూతన పరికరాలను జిల్లా యువజన క్రీడల శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమేరకు పరికరాలను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మేయర్ పునుకోల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జొహారా, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బ్యాడ్మింటన్ సంఘం మాజీ అధ్యక్షుడు సిరిపురపు సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుల,మతాలకతీతంగా సంక్షేమ పథకాలు..

ఖమ్మంఅర్బన్: కుల,మతాలకు అతీతంగా రాష్ట్రప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని ఆల్లిపురం రోడ్డులో ఇండిపెండెంట్ పాస్టర్స్ ఫెలోషిప్ పాస్టర్ వేముల సత్యం ఆధ్వర్యాన జరుగుతున్న రక్షణ సువార్త స్వస్థత మహాసభలు శుక్రవారం రాత్రి ముగియగా మంత్రి పాల్గొని మాట్లాడారు. కార్పొరేటర్లు రావూరి కరుణసైదబాబు, కూరాకుల వలరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం..

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని విజయనగర్ కాలనీ శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గత నాలుగు రోజుల నుంచి కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మంగళ వాయిద్యాలు, అర్చనలు, దీక్ష హోమాలు, గణపతి పూజలతో ప్రతిష్ఠించబడిన శ్రీసిద్ధి వినాయక, దత్తాత్రేయ స్వామిలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దర్శించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, మందిరం చైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్య సిద్ధాంతి, వైస్ చైర్మన్ బుద్ధ రామకృష్ణతో పాటు పెంట్యాల వెంకట నరసయ్య, చంద్ర వీరభద్రరావు, కార్పొరేటర్ పైడపల్లి రోహిణి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికుల వాగ్వాదం

నేలకొండపల్లి: వేగంగా బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను ప్రయాణికులు వారించగా మొదలైన ఘర్షణకు చివరకు పోలీస్‌స్టేషన్‌కు చేరింది. సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి ఖమ్మంకు శుక్రవారం వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతి వేగంగా నడుపుతుండటంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. మండలంలోని పైనంపల్లి వద్ద జాతీయ రహదారి పనుల వద్ద కూడా అలాగే నడపడంతో నెమ్మదిగా వెళ్లాలని డ్రైవర్‌గా సూచించగా వాగ్వాదం మొదలైంది. దీంతో ఆయన విధుల్లో ఉన్న తనను దూషించారని బస్సును నేరుగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాడు. ఈక్రమంలో ఘటనపై పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో పల్టీ..

ఒకరికి గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెం వద్ద ఆటో పల్టీకొట్టి ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారేపల్లికి చెందిన పరిటాల సంతోష్ అనే విద్యార్థి ఈ నెల 1వ తేదీన ఖమ్మం నుంచి కారేపల్లికి ఆటోలో వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో సంతోష్‌తో పాటు పలువురు ప్రయాణికులకు గాయాలైయ్యాయి. నాటి నుంచి సంతోష్ ఆస్పత్రిలో చికిత్స పొంది తర్వాత ఆలస్యంగా ఆటో డ్రైవర్‌పై రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీ నామా పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఖమ్మం నగరంలో పర్యటించారు. ఈసందర్భంగా ఇటీవల మృతి చెందిన వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ శ్రావణి, నాయకులు చిత్తారు సింహాద్రి యాదవ్, మోరంపూడి ప్రసాద్, తాళ్లూరి హరీష్, పాల్వంచ రాజేష్, రేగళ్ల కృష్ణప్రసాద్, మిక్కిలినేని నరేందర్, తాళ్లూరి జీవన్, సీతారాములు, పోలవరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న హెచ్ఎం, ఎండీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని బాలాజీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో అనుసరించాల్సిన విధానాలపై శుక్రవారం ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మోటివేషనల్ స్పీకర్ సామినేని శారద విద్యార్థులు పాటించాల్సిన సమయపాలన, స్టడీ మెటీరియల్ వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలాజీ ఎస్టేట్స్ ఎండీ వత్సవాయి రవి అందించిన పరీక్షా ప్యాడ్లను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాలస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

రఘునాథపాలెం: మండలంలోని బద్యాతండ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని మెరుగైన ఆరోగ్యం పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సుగుణ, ఉపసర్పంచ్ సునావత్ గౌస్, నాయకులు భుక్యా దేవా, మాలోతు ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డు పూర్తయ్యేదెన్నడు..?



మండలంలోని బౌద్ధక్షేత్రం నుంచి ముజ్జుగూడెం వెళ్లే రహదారిలో కొంత భాగం పనులు పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి వెంట కంకర వేసి వదిలివేయటంతో కంకర పైకి తేలి ఇదిగో ఇలా రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. తరుచూ వాహనాలు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల కలెక్టర్ పర్యటన సందర్భంగా రైతులు, ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ వారిలో చలనం రాలేదు. ఇంకెన్నాళ్లు పడుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

- నేలకొండపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : దేవేందర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, నేలకొండపల్లి
సెల్ నంబర్ : 97019 13939